ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 18 మే 2025

ప్రతిష్ఠాత్మకంగా మహానాడు

● జగన్ అడ్డాలో భారీస్థాయి సక్సెస్‌కు ప్రణాళిక

- కడప గడపలో నిర్వహించేందుకు టీడీపీ కసరత్తు
- మహానాడు విజయవంతం కోసం కమిటీల ఏర్పాటు
- ఐదులక్షల మందితో బహిరంగసభకు ప్లాన్
- నేడు ఐదుగురు మంత్రుల రాక
- ఇప్పటికే జిల్లాకు చేరుకున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు



మహానాడు నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

రాయలసీమ నడిబొడ్డు.. మాజీ సీఎం వైఎస్ కుటుంబ సభ్యులు ఇది మా గడ్డ అనే చెప్పుకునే కడప గడపలో ఈసారి మూడురోజుల పాటు పసుపు పండుగను నిర్వహించనున్నారు. నిన్న జరిగిన ఎన్నికల్లో కూటమికి ఉమ్మడి జిల్లా జనం జైకొట్టారు. ఈ నేపథ్యంలో కడప గడ్డలో మహానాడును చరిత్రలో నిలిచిపోయేలా నభూతోనభవిష్యత్ అనేలా నిర్వహించాలని టీడీపీ భావిస్తోంది. అందుకు తగ్గట్లు ఏర్పాట్లను ముమ్మరం చేస్తూ వచ్చింది. ఐదులక్షల మందితో బహిరంగసభను నిర్వహించి కడపలో అదుర్స్ అనిపించాలని ముందుకు సాగుతోంది. అదే సమయంలో మహానాడు నిర్వహణతో కడప జిల్లాకు లబ్ధి చేకూరుతుందనే ఆశ జిల్లావాసులలో ఉంది.

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులో సుమారు 120 ఎకరాలు ఉన్న పబ్బాపురం లేఅవుట్‌లో మహానాడు నిర్వహిస్తున్నారు. వేదికకు సంబంధించి పనులు చకచకా సాగుతున్నాయి. పాకిస్థాన్‌తో యుద్ధం కారణంగా కొద్దిరోజులు మహానాడు నిర్వహణపై సందిగ్ధం ఏర్పడింది. మూడురోజులా రెండురోజులా, ఒక్కరోజుకు కుదిస్తారా అనే సందేహం నెలకొంది. అయితే యుద్ధం ముగిసిపోవడంతో మహానాడు మూడురోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించారు.

కడపలో నిర్వహించే మహానాడును సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. రెండురోజుల క్రితమే అమరావతిలో మహానాడు ఏర్పాట్లపై జిల్లా నేతలతో చర్చించారు. మహానాడు సక్సెస్ కోసం మంత్రులు, ఇతర టీడీపీ నేతలతో కలిసి కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. వీరంతా కోఆర్డినేషన్‌తో మహానాడును సక్సెస్ చేయనున్నారు. ఇందులో భాగంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఏపీఐఐసీ చైర్మన్ రాజు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు శనివారం కడపకు వచ్చారు. వీరు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, టీడీపీ నేతలతో కలసి మహానాడు ప్రాంగణాన్ని పరిశీలించారు. రెండురోజుల పాటు నిర్వహించే ప్లీనరీ సభావేదిక, బహిరంగ సభ వేదిక, వీఐపీల గ్యారేజీలు, సీఎం చంద్రబాబునాయుడు బస, రక్తదానశిబిరం, ఎగ్జిబిషన్, ఫుడ్‌కోర్టు తదితర వాటిని ఎక్కడ ఏర్పాటు చేయాలనేదానిని పరిశీలించారు. శనివారం సాయంత్రానికి ప్రాంగణంలో ఉన్న చెట్లను ఇతర వాటిని తొలగించి చదను చేశారు. ఇక ప్లీనరీ, బహిరంగసభ, గ్యాలరీలు ఇతర వాటి పనులు చేపట్టనున్నారు.

పార్కింగ్ కోసం 300 ఎకరాలు

మహానాడు నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కడప నగరం చుట్టూ 35 కి.మీ మేర రింగురోడ్డు విస్తరించి ఉంది. తిరుపతి, హైదరాబాదు, కర్ణాటక వెళ్లే వాహనాలన్నీ రింగురోడ్డును దాటే వెళ్లాలి. టీడీపీ నిర్వహించే మహానాడు పబ్బాపురంలో రింగురోడ్డును ఆనుకునే ఉంది. అందుకే ఈ ప్రాంతంలో మహానాడు ట్రాఫిక్ లేకుండా చూసేందుకు పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అటు రాయచోటిరోడ్డు, ఇటు కర్నూలు రోడ్డు, పులివెందుల రోడ్డు ప్రాంతంలో సుమారు 300 ఎకరాల్లో వాహన పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అయితే మరీ దూరమైతే బహిరంగసభకు వచ్చేందుకు జనం ఇబ్బంది పడతారని మహానాడు వేదిక చుట్టుపక్క ల పరిసరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

జగన్ గడ్డలో సక్సెస్ కోసం

మాజీ సీఎం జగన్ సొంత జిల్లాలో నిర్వహించే మహానాడును టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎన్నికల దృష్ట్యా గత ఏడాది మహానాడు నిర్వహించలేదు. అంతకు ముందు నిర్వహించిన మహానాడుకు జనగ్ ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టించింది. ఇప్పుడు టీడీపీ అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో జగన్ అడ్డాలో నిర్వహించే బహిరంగసభను కనీవినీ ఎరుగని రీతిలో సక్సెస్ చేసి రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీని దెబ్బకొట్టాలని నిర్ణయించింది. చివరిరోజున ఐదులక్షల మందితో బహిరంగసభ నిర్వహించనున్నారు. అయితే ఇప్పటిదాకా జిల్లా టీడీపీలో సరైన సమన్వయంలేదు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. గ్రూపు తగాదాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహానాడు సక్సెస్ కోసమే స్టేట్ టీంలోని కీలకనేతలను అధిష్ఠానం బరిలోకి దించింది. ఆదివారం సాయంత్రం మహానాడు జరిగే ప్రాంగణంలోనే సమావేశం నిర్వహించనుంది. ఇందుకోసం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, హోంమంత్రి అనిత, మంత్రులు నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సీఎం ప్రోగ్రాం కన్వీనర్ వెంకటేశ్ రానున్నారు. ఇప్పటికే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాశ్రీనివాస్, పట్టాభి వచ్చారు. వీరంతా కలిసి సమావేశం నిర్వహించటంతో పాటు విభాగాల వారీగా కమిటీలను ప్రకటించనున్నారు.

పాకిస్థాన్‌కు దిమ్మ తిరిగేలా ఆపరేషన్ సిందూర్

● తిరంగా ర్యాలీలో కూటమి నేతలు



ఆపరేషన్ సిందూర్ విజయంతంపై తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నేతలు

కడప మారుతీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత త్రివిధ దళాల సైనికులు ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు దిమ్మతిరిగేలా షాక్ ఇచ్చారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ పేర్కొన్నారు. భారత త్రివిధ దళాలకు, ప్రధాని నరేంద్రమోదీకి సంఘీభావంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి సారథ్యంలో శనివారం స్థానిక కోటిరెడ్డి సర్కిల్ నుంచి 7 రోడ్ల కూడలి వరకూ పెద్ద ఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం 7 రోడ్ల కూడలి వద్ద వారు మాట్లాడారు. త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చి తద్వారా ఉగ్ర మూకపై విరుచుకుపడేలా ఊతమిచ్చిన ప్రధాని నరేంద్రమోదీ, హోం మినిస్టర్ అమిత్‌షాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మరోసారి పాకిస్థాన్ ఉగ్రమూకలు పేట్రేగితే ప్రపంచ పటంలో ఆ దేశం గల్లంతే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మడకా చక్రధర్, బండి ప్రభాకర్, యాటగిరి రాంప్రసాద్, వంగళ శశిభూషన్‌రెడ్డి, మునగా సతీశ్‌కుమార్, బొమ్మన విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ భవనం... అధ్వానం

● బాత్రూంల నీటితో లీకేజీలు
● తడిసిపోతున్న మందులు
● ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
7

పెన్నాలో ఇసుక అక్రమ తవ్వకాలు
6

బదిలీల సందిగ్ధతను తొలగించండి

● నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరాజు
6

కనులపండువగా రథోత్సవం

● భక్తజనసంద్రమైన జమ్మలమడుగు

జమ్మలమడుగు, మే 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో నారాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం కనులపండువగా జరిగింది. ఉదయం 8.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీవారి రథం వద్ద ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఆలయ అధికారులు పూజలు చేసి మొక్కుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే రథాన్ని ప్రారంభించారు. 8.45 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. రథం వెంట రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు భక్తులకు పానీయాలు అందజేశారు. ఎద్దుల ఈశ్వరరెడ్డి విగ్రహం పక్కన కౌన్సిలర్ ముల్లాజానీ, మదరసా పెద్దలు, మరికొందరు ముస్లింలు రథం వెంట వచ్చిన భక్తులకు మిఠాయి, చల్లని పానీయాలు అందజేశారు. రథం నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోకి సాయంత్రం 5 గంటలకు చేరుకుంది. రథోత్సవం ప్రశాంతంగా ముగిసింది. రథం వెంట డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ లింగప్ప, ఎస్ఐలు హైమావతి, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, సుబ్బారావు, ఇతర మండలాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, గోనా పురుషోత్తంరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, పోలీసు చంద్ర, నవనీశ్వరరెడ్డి, మహేంద్ర, ఉస్మాన్‌బాష, ఫయాజ్, కేకే రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా.. నారాపురం వెంకటేశ్వరస్వామి రథం తేరు రోడ్డులోకి రాగా ఉదయం 9.40 గంటలకు అక్కడ ఒక ఆవు బెదిరి భక్తులపైకి వచ్చింది. దీంతో భక్తులు పరుగులు తీశారు. స్థానికులు 20 నిమిషాల పాటు శ్రమించి చాకచక్యంగా ఆవును తాళ్లతో కట్టి పక్కకు తీసుకెళ్లారు.



నారాపురం వెంకటేశ్వరస్వామి రథోత్సవంతో జమ్మలమడుగులో భక్తులతో కిటకిటలాడుతున్న తేరు రోడ్డు

'చైర్మన్ సీటుకు రూ.2.5 కోట్లు తీసుకొన్నారు'

మైదుకూరు రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపల్ చైర్మన్ సీటు కోసం తన దగ్గర రూ.2.5కోట్లు తీసుకొన్నారని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపై మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర తీవ్రంగా మండిపడ్డారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయం అంటే సేవ అని వ్యాపారం కాదు అనటం చూస్తే తనకు నవ్వు వస్తోందని ఎద్దేవా చేశారు. తాను చైర్మన్ కాకముందు ఒకటిన్నర కోటి, చైర్మన్ అయిన మూడు నెలల తరువాత మరో కోటి రూపాయలు తన దగ్గర రఘురామిరెడ్డి తీసుకున్నారన్నారు. మైదుకూరులోని వైసీపీ కౌన్సిలర్లందరిని గుత్తమొత్తం రేటు మాట్లాడుకుని టీడీపీకి అమ్మాలని చూశారన్నారు. అదే విషయాన్ని ఎంపీ అవినాశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. తరువాత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లాలని చూశామని.. కానీ తమను జగన్‌తో కలవనీయకుండా చేశారన్నారు. తాను చైర్మన్ అయినప్పటి నుంచి ఎక్కడా ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా కౌన్సిలర్లకు, ప్రజలకు పనులు చేశానన్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే మున్సిపాలిటీలోని ప్రతి వర్క్ దగ్గరా కమీషన్లు తీసుకుని వ్యాపారం చేశారన్నారు.

స్వచ్ఛాంధ్ర కోసం బాధ్యతగా పనిచేయాలి



చెన్నూరులో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్, ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తదితరులు

చెన్నూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలను అలాగే ఉంచుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా 'వేసవిలో వేడిని తట్టుకుని ఆరోగ్యంగా ఉండడం ఎలా' అనే విషయమై స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇళ్లల్లో పాడైపోయి నిరుపయోగంగా ఉన్న ఈ-వ్యర్థాలన్నింటినీ పూర్తిగా బయటికి తొలగించాలన్నారు. అలాగే ఉంచుకుంటే వాటి ద్వారా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఇల్లు ప్రతి ఊరు ఆరోగ్యంగా ఉండాలంటే ఇంటింటికీ రెండు మొక్కలు పెంచాలని అవి వృక్షాలుగా మారి మన ఊరిని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మనకు మంచి ఆరోగ్యం ఇస్తాయని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చెన్నూరును ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఏడాదిలోపు చెన్నూరును ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దేందుకు ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తామని కలెక్టర్ అన్నారు. అనంతరం పంచాయతీ ఆవరణంలో కలెక్టర్, ఎమ్మెల్యేతో పాటు జేసీ అదితిసింగ్ మొక్కలు నాటారు. దానికి ముందు గ్రామ పంచాయతీని పరిశుభ్రంగా ఆరోగ్యవంతంగా ఉంచాలంటూ ర్యాలీ చేశారు. దుకాణ యజమానులతో కలెక్టర్ మాట్లాడుతూ వ్యర్థాలను రోడ్లపైన వేయొద్దని సూచించారు. అంతకుముందు ప్రజలతో తాము స్వచ్ఛాంధ్ర కోసం బాధ్యతగా నిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఓబులమ్మ, ఆర్డీవో జాన్ ఎర్విన్, డీపీవో రాజ్యలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఏడుకొండలు, తహశీల్దారు సరస్వతి, మండల కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● పోలీసు సిబ్బందికి ఎస్పీ సూచన



సెల్ కౌంట్ అనలైజర్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని తగిన చికిత్స తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యలయ ఆవరణలోని జిల్లా సంక్షేమ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక సెల్ కౌంట్ అనలైజర్ మిషన్‌ను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మిషన్ పనితీరును యూనిట్ డాక్టర్ మేరీ సుజాతను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ సెల్ కౌంట్ మిషన్ ద్వారా ఉచితంగా పోలీసు సిబ్బందికి, వారి కుటుంబాలకు పలు రకాల ప్రాణాధార రక్త పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉంటాయన్నారు. హిమోగ్లోబిన్, బ్లడ్ ప్లేట్‌లెట్స్, తెల్ల రక్తకణాలు, ఇతరత్రా రక్తపరీక్షలు చేయించుకుని అవసరమైన చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు, ఆర్ఐలు టైటస్, వీరేశ్, శ్రీశైలరెడ్డి, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డీలర్ల జోలికిపోతే అధికారులకు బదిలీలే..!

● ప్రొద్దుటూరులో సాగుతున్న రేషన్ డీలర్ల దందా

ప్రొద్దుటూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగిస్తున్న వ్యాపారులు, డీలర్ల జోలికి పోతే.. అధికారులకు ఏకంగా బదిలీలు, డిప్యుటేషన్లు తప్పడం లేదు. ప్రొద్దుటూరులో ఇటీవల స్థానిక సివిల్ సప్లయ్ అధికారులు తరుచూ దాడులు జరిపి రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటున్నారు. పలువురు రేషన్ డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో కొందరు రేషన్ డీలర్లు రాజకీయ పెద్దల అండతో ఈ అధికారి ఇక్కడే ఉంటే మన ఆటలు సాగవని చెప్పి ప్రజా ప్రతినిధి చేత జిల్లా అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆ అధికారి వచ్చి 6 నెలలు తిరగముందే అతడిని డిప్యుటేషన్‌పై పంపనున్నారు. ఆమేరకు శనివారం ఆ అధికారిని బద్వేలుకు పంపుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బద్వేలులో ఉన్న అధికారిని ఇక్కడికి పంపారు.

వైసీపీ ప్రభుత్వంలో రేషన్ మాఫియా యథేచ్ఛగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి కోట్ల రూపాయలు వెనకేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ డీలర్లు రెండు నెలలుగా ప్రొద్దుటూరులో రేషన్ బియ్యం వాహనాల తిరగకుండా వాటిని బంద్ చేయించారు. నేరుగా డీలర్లే రేషన్ బియ్యం పంపిణీ చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధి చేత అధికారులకు సిఫారసు చేయించారు. దీంతో రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు ఎండీయూ వాహనాలను నిలిపివేసి డీలర్ల చేతనే పంపిణీకి చర్యలు తీసుకున్నారు. కానీ చాలా మంది అధికార పార్టీ డీలర్లు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయకుండా బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే అధికారుల దాడుల్లో రేషన్ బియ్యం పట్టుబడుతున్నాయి. ఎండీయూ వాహనాల ద్వారా 10వ తేదీ లోపలే సరుకులు 80 శాతం పైగా పంపిణీ జరిగితే డీలర్లు మాత్రం ఏప్రిల్, మే రెండు నెలల్లో పర్సెంటేజీ సక్రమంగా పంపిణీ చేయలేదని అధికారులు నివేదిస్తున్నారు. డీలర్లు వద్దకు వృద్ధులు, దివ్యాంగులు వెళ్లి రోజుల తరబడి తిరిగి రేషన్ తెచ్చుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు రాష్ట్రాలను కలిపే రహదారిపై నీలినీడలు

- దశాబ్దాలుగా పాపాఘ్నిపై వంతెన నిర్మాణానికి గ్రహణం
- వంతెన నిర్మిస్తే ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాలకు కొత్త మార్గం
- కడప-బెంగళూరుకు తగ్గనున్న 60 కిలోమీటర్ల దూరం

ములకలచెరువు, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాలతో పాటు రాయలసీమ పరిధిలోని మూడు జిల్లాలను దగ్గర చేసే రహదారిపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. పాపాఘ్ని నదిపై వంతెన నిర్మాణం చేపడితే కడప-బెంగళూరుకు కొత్తమార్గం ఏర్పడుతుంది. అయితే వంతెన నిర్మాణానికి దశాబ్దాలుగా గ్రహణం పట్టుకుంది. రాయలసీమలోని అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజల స్వప్నం కలగా మిగిలిపోయింది. వంతెన నిర్మాణం దశాబ్దాల నుంచి ప్రతిపాదనల దశలోనే ఉండిపోయింది. వంతెన నిర్మాణం పూర్తి చేసి ఇరువైపులా కిలోమీటరు రోడ్డు వేస్తే కొత్త మార్గం ఏర్పడి కడప-బెంగళూరుకు 60 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ములకలచెరువు మండలం కాలవపల్లె సమీపంలో పాపాఘ్ని నది కాలువ ప్రవహిస్తోంది. కాలువకు ఇరువైపులా అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల సరిహద్దులు ఉన్నాయి. అలాగే ఇరువైపులా తారు రోడ్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ మార్గంలో ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వర్షాకాలంలో కాలువ అధికంగా ప్రవహిస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఈ నదిపై వంతెన నిర్మాణం చేపట్టి ఇరువైపులా కిలోమీటరు మేర తారు రోడ్డు వేస్తే కొత్త మార్గం ఏర్పడుతుంది. ప్రస్తుతం బెంగళూరు నుంచి కడపకు వెళ్లేందుకు మదనపల్లె, రాయచోటి మీదుగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పాపాఘ్నిపై వంతెన నిర్మిస్తే బెంగళూరు నుంచి చింతామణి, బి.కొత్తకోట, ములకలచెరువు, కాలువపల్లె, సత్యసాయి జిల్లా పెడబల్లి, గాలివీడు, రాయచోటి మీదుగా కడపకు కొత్త మార్గం ఏర్పడుతుంది. ఈ మార్గం వల్ల బెంగళూరు-కడపకు 60 కిలోమీటర్ల దూరం తగ్గి విలువైన ఇంధనం, సమయం ఆదా అవుతుంది. ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల ప్రజలు శ్రీసత్యసాయి జిల్లాలోని ఎన్‌పీ కుంట, గాండ్లపెంట, అన్నమయ్య జిల్లాలోని పెడబల్లి, గాలివీడు, రాయచోటి, కడప ప్రాంతాలకు వెళ్లేందుకు అతి దగ్గర మార్గం ఏర్పడుతుంది. కాలువపల్లె నుంచి నది దాటితే అర కిలోమీటరు దూరంలోనే పెడబల్లి రోడ్డుకు చేరుకోవచ్చు. శ్రీసత్యసాయి జిల్లాలోని తిమ్మమ్మమర్రిమాను వెళ్లేందుకు కాలువపల్లె పంచాయతీలోని గ్రామాల ప్రజలు నది దాటి వెళితే ఎనిమిది కిలోమీటర్లు దూరం మాత్రమే ఉంది. ఇక్కడి నుంచి తిమ్మమ్మమర్రిమానుకు బస్సులో వెళ్లాలంటే ములకలచెరువు మీదుగా మూడు బస్సులు మారి 50 కిలోమీటర్ల వెళ్లాల్సి వస్తోంది. 1996లో రూ.5 లక్షలతో పాపాఘ్నిపై నిర్మించిన కాజ్‌వే నెల రోజుల వ్యవధిలోనే వరదలకు కొట్టుకుపోయింది. దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న వంతెనను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు మాట ఇచ్చి అమలు చేయడం మరిచారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైన పాపాఘ్ని వంతెన నిర్మాణానికి చొరవ తీసుకోవాలని మూడు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.



కాలువపల్లె సమీపంలోని పాపాఘ్ని నదిపై వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

కూటమి ప్రభుత్వంపై ఆశలు


ములకలచెరువు మండలం కాలుపల్లె సమీపంలోని పాపాఘ్నిపై వంతెన నిర్మాణానికి ఇక్కడి ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. ఎన్నోమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోయింది.

వైసీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణం గురించి పట్టించుకున్న పాపానపోలేదని పలువురు చెబుతున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకుని వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. వంతెన నిర్మాణం చేపడితే అత్యంత మారుమూల ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



పాపాఘ్ని కాలువకు అర కిలోమీటరు దూరంలో ఉన్న పెడబల్లి రోడ్డు

రెండు రాష్ట్రాలకు కొత్త మార్గం ఏర్పడుతుంది



పాపాఘ్నిపై వంతెన నిర్మాస్తే ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాలకు కొత్త మార్గం ఏర్పడుతుంది. మూడు జిల్లాల సరిహద్దు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కర్ణాటక రాష్ట్రం నుంచి అన్నమయ్య, శ్రీసత్యసాయి, కడప జిల్లాలకు కొత్త మార్గం ఏర్పడుతుంది. కడప నుంచి బెంగళూరుకు 60 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఎందుకో తెలియదు గానీ ఎవరూ పట్టించుకోవడం లేదు.

-కమ్మల సిద్దప్ప, కాయలవారిపల్లె, కాలువపల్లె పంచాయతీ

అత్యంత వెనుకబడిన ప్రాంతం అభివృద్ధి



పాపాఘ్నిపై వంతెన నిర్మిస్తే అత్యంత వెనుకబడిన మారుమూల ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. రోడ్డుకు ఇరువైపులా కిలోమీటరు మేర తారు రోడ్డు వేస్తే చాలు కొత్త మార్గం ఏర్పడుతుంది. ఈ ప్రాంతం వారికి శ్రీసత్యసాయి, అన్నమయ్య, కడప జిల్లాలకు వెళ్లాలంటే దగ్గర దారి ఏర్పడుతుంది. వంతెన నిర్మిస్తారేమోనని ఏళ్ల తరబడిగా ఎదురు చూస్తున్నాం.

- పెద్దమౌలాసాహెబ్, కాలువపల్లె

బదిలీల సందిగ్ధతను తొలగించండి

నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరాజు



మంత్రి మండిపల్లితో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నేతలు

రాయచోటిటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల్లో నెలకొన్న సందిగ్ధతను వెంటనే తొలగించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన ఎన్‌టీఏ నేతలతో కలిసి రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో గాడి తప్పిన విద్యా వ్యవస్థను సరైన గాడిలో పెట్టడానికి అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారని తెలిపారు. విద్యా వ్యవస్థ, ఇటు ఉపాధ్యాయుల సంక్షేమానికి ఇబ్బంది కలగకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అదేవిధంగా ఉపాధ్యాయ సమస్యలపై ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న బదిలీలు, పదోన్నతులపై ప్రతిష్టంబన నెలకొన్న దృష్ట్యా, ఉపాధ్యాయ సంఘాలు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరగా వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అవకాశం ఉన్నంత వరకు ఉపాధ్యాయ సంఘా లు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి అందని ఆమోదయోగ్యంతోనే బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను త్వరలో ప్రభుత్వం విడుదల చేయనుందన్నారు. కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోషియేషన్ నాయకులు బచ్చల శ్రీనివాసులు, కులశేఖర్‌రెడ్డి, గోవిందు నాగరాజు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మినీ వ్యాను, ద్విచక్ర వాహనం ఢీ



ప్రమాదం జరిగిన స్థలంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

ఓబులవారిపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి) : కడప-చెన్నై జాతీయ రహదారి మంగంపేట వద్ద శుక్రవారం రాత్రి మినీ ఐచర్ వాహనం, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... నందలూరు మండలానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి రైల్వేకోడూరు నుంచి నందలూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రాజంపేట వైపు నుంచి వస్తున్న మినీలారీ ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108 వాహనం ద్వారా రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అక్కడి నుంచి కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



వెంకటరెడ్డి మృతదేహం

ములకలచెరువు, మే 17 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు...మండలంలోని చౌడసముద్రం పంచాయతీ చెట్లవారిపల్లెకు చెందిన వెంకటరెడ్డి (38) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య వెంకటరమణమ్మ, ఇద్దరు కుమార్తెలు సుస్మిత, అశ్విని, కుమారుడు చరణ్ ఉన్నారు. చాలా రోజులుగా వ్యవసాయం కోసం అప్పులు చేసి పంటలు చేతికిరాక మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఈనెల 14వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు చికిత్సల నిమిత్తం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామానికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా రైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

మదనపల్లెలో భారీ వర్షం

- జలమయమైన రహదారులు ● ఆగిన విద్యుత్ సరఫరా ● ట్రాఫిక్‌కు అంతరాయం





బెంగళూరు బస్టాండులో నిలిచిన వర్షపునీరు - మార్వారీవీధిలో వర్షపు జల్లుల దృశ్యం

మదనపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన వర్షం..అరగంటకుపైగా దంచికొట్టింది. దీంతో వాహనదారులు ఎక్కడిక్కడే నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు రహదారులు, కాలువలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ మండిపోయింది. ఎం వేడిమితో అల్లాడిపోయిన ప్రజలు..సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమై..చివరకు 6 గంటలకు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో అక్కడక్కడా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ భారీ వర్షంతో పైప్రాంతం నుంచి వచ్చిన వర్షపు నీరు బెంగళూరు బస్టాండు, చిత్తూరు బస్టాండు ఏరియాలను ముంచెత్తింది. గాంధీ రోడ్డు, అంబేడ్కర్‌సర్కిల్‌లో వర్షపునీరు చేరి చెరువును తలపించాయి. అలాగే గాంధీరోడ్డు, ఇందిరానగర్, నీరుగట్టువారిపల్లె, తదితర ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. డివిజన్‌లోని ములకలచెరువు, తంబళ్లపల్లె, కురబలకోట, మదనపల్లె మండలంలోని బొమ్మనచెరువు, చీకలబైలు, కొత్తపల్లె, సీటీఎం ఏరియాలలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ములకలచెరువు, తంబళ్లపల్లె ఏరియాలలో సాయంత్రం నుంచే ఈదురుగాలులతో కూడిన తుంపర్లు పడటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో పాటు ఎండుతున్న పంటలకు ఉపశమనం కలిగినట్లయింది.



చిత్తూరు బస్టాండులో నిలిచిన వర్షపునీరు

పెన్నాలో ఇసుక అక్రమ తవ్వకాలు



పెన్నానదిలో ఇసుక రవాణాతో ఏర్పడ్డ గోతులు



ట్రాక్టర్లలోకడపకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్న దృశ్యం

సిద్దవటం, మే 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమార్కులకు ఇసుక కాసులు కురిపిస్తోంది. పెన్నానది నుంచి కొందరు అక్రమంగా ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేకున్నా డేగనవారిపల్లె, సిద్దవటం హైలెవల్ వంతెన సమీపాన మూలపల్లె క్రాస్, లింగంపల్లి, టక్కోలి గ్రామాల వద్ద నుంచి ప్రతినిత్యం ఇసుక అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసి ఒక్కో ట్రిప్పు 4 వేల రూపాయలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక తవ్వకాల వల్ల రైతులు పొలాల వద్ద పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి బోర్లు బయటపడ్డాయి. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల ప్రస్తుతం వేసవిలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో రైతులు తీవ్ర నష్టపోతున్నారు. కొంతమంది పొలాలకు మట్టి తరలింపు పేరుతో స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ వద్ద అనుమతి పొంది పెన్నా నది ఒడ్డున పెద్ద పెద్ద యంత్రాలతో ఇసుక తరలిస్తున్నారని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రమణ్యంను వివరణ కోరగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకుని సీజ్ చేస్తామన్నారు. పెన్నానది పరీవాహక ప్రాంతాల్లో జేసీబీ యంత్రంతో తవ్వకాలు చేపట్టకూడదని అక్రమ ఇసుక రవాణా అరికడతామని తెలిపారు.

21న డీఈవో కార్యాలయం ముట్టడి

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి

పీలేరు రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీఈవో కార్యాలయ ముట్టడి ఈనెల 21వ తేదీ జరుగుతుందని ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.సదాశివరెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం ఆయన పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల్లో ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల డిమాండ్లను పరిగణలోకి తీసుకోకుండా నియంత పోకడతో జీవో జారీ చేసిందని తెలిపారు. 21న బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రతి మండల శాఖ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ పోరాటం మన బడుల భవిష్యత్ కోసమేనన్న విషయం ఎవరూ మరువవద్దన్నారు. గత ప్రభుత్వం ఆరు విధానాల బడులను ప్రవేశపెడితే ఈ ప్రభుత్వం అవే విధానాలను అవలంబిస్తూ 9 రకాల బడులను ప్రవేశపెట్టిందని వాపోయారు. ఏ ప్రభుత్వం ఉన్నా ప్రపంచ బ్యాంక్ విధానాలను అమలు చేయడం శోచనీయం అన్నారు. సాకులు చెప్పి ఉద్యమానికి దూరంగా ఉంటే కొన్నాళ్లకు బడుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అందరు ఉపాధ్యాయులు పాల్గొని ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.శివారెడ్డి పాల్గొన్నారు.

నిలువ ఉంచిన టపాసులు సీజ్

సుండుపల్లె, మే17 (ఆంధ్రజ్యోతి): అనధికారికంగా నిలువ ఉంచిన టపాసులను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ ధైవాదీనం తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని వెంగమరాజుగారిపల్లె సమీపంలో సోమలరాజు రాఘవేంద్రరాజు సుమారు రూ.1.50 లక్షల విలువ గల టపాసులను ఒక గదిలో నిలువ ఉంచినట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేసి సీజ్ చేశామన్నారు. అనుమతులు లేకుండా ఈ టపాసులను నిలువ ఉంచడం చట్టరీత్యా నేరమని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో రమణ, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.


హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

నిమ్మనపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): దంపతులపై కోడి కత్తులతో దాడి కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చౌడేపల్లి మండలం బోయకొండ పంచాయతీ యానాది కాలనీకి చెందిన దేవరకొండ యర్రప్ప (30), అక్కులప్ప, హనుమంతు అన్నదమ్ములు. తన భార్య శ్యామల (26)తో తమ్ముడు అక్కులప్ప వివాహేతర సంబంధం ఉందని అనుమానించిన యర్రప్ప తమ్ముడిని మందలించడంతో ఏడాది క్రితం అక్కులప్ప పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తన అన్న చావుకు యర్రప్ప, శ్యామల కారణమని భావించిన హనుమంతు పలుమార్లు వారితో గొడవ పడ్డాడు. శుక్రవారం బండ్లపై పంచాయతీ దుర్గవారిపల్లిలో తన మిత్రులు అశోక్ (21), శివానంద్ (29)తో కలసి కోడికత్తులతో అన్న వదినపై దాడి చేసి పరారయ్యారు. ఈ కేసులో దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

రామసముద్రం, మే 17 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఈనెల 14న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష రాయడానికి రామసముద్రంకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం బంధువులు, స్నేహితులను విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం బాలిక తల్లి స్వాతి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాజగోపురంపై పిడుగుపాటు



దెబ్బతిన్న విగ్రహాలు

పెద్దమండ్యం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపేపల్లి నరసింహస్వామి ఆలయ రాజగోపురంపై శుక్రవారం రాత్రి పిడుగు పడింది. దీంతో గోపురంపై ఉన్న ప్రతిమలు కొద్దిగా దెబ్బతిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవలే ఈ రాజగోపురానికి కుంభాభిషేకం చేశారు. పిడుగుపాటు నేపథ్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు, వేద పండితులు వెల్లడించారు.

నేడు ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే

రాయచోటి (కలెక్టరేట్), మే 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా ఆదివారం రాయచోటిలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి డైట్ కళాశాల వరకు సాయంత్రం 6.30 గంటలకు సైలెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబరు 1న అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం జరుపుకోవడంతో పాటు ప్రతి సంవత్సరం మే నెల మూడవ ఆదివారాన్ని అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు.

హెచ్‌ఐవీ లేదా ఎయిడ్స్ వ్యాధితో ఎంతోమంది ప్రాణాలు, జీవితాలను కోల్పోయారని, వారి జ్ఞాపకార్థం, హెచ్‌ఐవీతో జీవిస్తున్న ప్రజలకు సహాయం చేయడానికి తమ జీవితాలను అంకితం చేసి వారి సేవలను గుర్తించడం కోసం, సమాజంలో హెచ్‌ఐవీ వల్ల కలిగే సామాజిక, ఆర్థిక నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహించుకుంటున్నామని తెలిపారు. రాయచోటిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డైట్ కళాశాల వరకు మేము గుర్తించుకుంటాం, మేము మాట్లాడతాం, మేము నడిపిస్తాం అనే థీమ్‌తో ఈ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ ఉంటుందని తెలిపారు.

నాటుసారా విక్రేతల అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

మదనపల్లె టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ భీమలింగ కథనం మేరకు..నిమ్మనపల్లె మండలం బురుజుమాదిగపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు రవి (46)ను అదుపులోకి తీసుకుని ఆరు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. దివిటివారిపల్లె వద్ద సారా విక్రయిస్తున్న చిన్నరెడ్డెప్ప (54)ను అదుపులోకి తీసుకుని 7 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు జబీవుల్లా, డోర్కాస్, హెచ్‌సీలు మహమ్మద్ అలీ, శ్రీనివాసులు, పీసీలు వెంకటేశ్, నాగరాజు, మధు, శివరాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

కలసపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐటీఐ కళాశాల సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అవ్వ, మనువడు మృతి చెందారు. వివరాల్లోకెళితే... సింగరాయపల్లె గ్రామానికి చెందిన తలారి జస్వంత్ (14) అతని అవ్వ సారమ్మ (45) కలసపాడు నుంచి సింగరాయ పల్లెకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో ఎక్సెల్ వాహనంపై వెళ్తున్న అవ్వ, మనువడు అక్కడికక్కడే మృతిచెందారు. తమ గ్రామంలో జరిగే తిరుణాలకు సరుకులు తీసుకొని గ్రామానికి వస్తుండగా చెన్నుపల్లె నుంచి గొర్రెలు తీసుకొని వెళ్తున్న వాహనం ఢీకొంది. ప్రమాదం తెలిసిన వెంటనే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. ప్రమాద విషయం తెలిసి సంగరాయపల్లె గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.

పిడుగు పడి ఒకరు...



మృతిచెందిన సుబ్బరామయ్య

చాపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామం వద్ద పొలాల్లో పిడుగుపడి బాలాయపల్లె సుబ్బరమణయ్య (35) మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో గాలివాన కురిసింది. ఆ సమయంలో అతనికి కొద్దిదూరంలో పిడుగుపడి మృతిచెందినట్లు తెలిపారు. మేకలు, గేదెలు మేపుకునేందుకు పొలాల్లోకి వెళ్లగా ఈ సంఘటన జరిగింది. పిడుగు పడి అతని శరీరం నల్లగా మారింది. పిడుగు పడే సమయంలో అతనికి కొద్ది దూరంలో మరో ఇద్దరు మహిళలు ఉన్నారు. కానీ వారికి, గేదెలు, మేకలకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అతన్ని ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి కుటుంబ సభ్యులు ఆటోలో తీసుకుపోయారు. అతనికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. సుబ్బరమణయ్య మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని వృద్ధుడు...



మృతిచెందిన గుర్తుతెలియని వృద్ధుడు

పులివెందుల, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఓ వైన్‌షాప్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడు. సీఐ చాంద్ బాష వివరాల మేరకు.. దాదాపు 68 ఏళ్లు కలిగిన వృద్ధుడు తీసేసిన బస్టాండ్ సమీపంలోని వైన్ షాపు వద్ద మద్యం తాగి అపస్మారక స్థితి లోకి వెళ్లి మృతిచెందాడు. ఇతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఈ వృద్ధుడు ఎవరన్నది గుర్తించలేక పోతున్నామన్నారు. ఇతని గుర్తింపు కోసం సోషల్ మీడియా ద్వారా మృతుడి ఫొటోలను పంపించామని తెలిపారు. ఎవరికైనా వృద్ధుడి సమాచారం తెలిస్తే అతని మృతదేహాన్ని తీసుకెళ్లవచ్చని ఆయన వివరించారు.

ట్రాక్టరు- ఆటో ఢీకొని మహిళ...

మైదుకూరురూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని లెక్కలవారిపల్లె సమీపంలో శనివారం తెల్లవారుజామున ట్రాక్టర్, ఆటో ఢీకొని నానుబాల పల్లెకు చెందిన పేర్నపాటి సుబ్బమ్మ (42) అనే మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి సమాచారం మేరకు.. నానుబాలపల్లె నుంచి నల్లపురెడ్డిపల్లెకు వ్యవసాయ కూలీలు ఆటోలో వెళుతుండగా లెక్కలవారిపల్లె సమీపంలో నల్లపురెడ్డిపల్లె నుంచి వనిపెంటకు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనింది. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందగా, ఆరు మంది మహిళలకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

భర్త వేధింపులు తాళలేక..

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం

పులివెందుల, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబల్లె గ్రామానికి చెందిన స్వాతి అనే మహిళ భర్త వేధింపులు తాళలేక తన ఇద్దరు కుమార్తెలతో శుక్రవారం రాత్రి అదృశ్యమైంది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు. స్వాతి భర్త దేవేంద్ర అనుక్షణం వేధిస్తుండేవాడని, ఈ వేధింపులు తాళలేక కుమార్తెలు శ్రావ్య, హారిణిలను తీసుకొని వెళ్లిపోయిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహానాడు విజయవంతానికి సహకరించాలి



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి): మహానాడు విజయవంతం చేసేందుకు జిల్లాలో ప్రతిఒక్కరూ సహకరించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్దన్ రెడ్డిలు పిలుపునిచ్చారు. శనివారం కడప నగరం హరిటవర్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29 తేదీలలో మహానాడు జరగబోతోంద న్నారు. టీడీపీ 43 ఏళ్ల చరిత్రలో మొదటిసారిగా కడపలో నిర్వహించడం జిల్లా వాసులకే కాక రాయలసీమ వాసులకు గర్వకారణంగా భావిస్తున్నామని చెప్పారు. జిల్లాలో అందరం కలిసి మహానాడును విజయవంతం చేయాలని కోరారు.

మహానాడు విజయవంతమే అందరి లక్ష్యం

మహానాడు విజయవంతం చేయాలన్నదే ప్రతిఒక్కరి లక్ష్యమని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ పిలుపునిచ్చారు. శనివారం కడప టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లు, కమిటీలు, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్‌రెడ్డి, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్దిక్‌లతో పాటు టీఎన్ఎస్ఎఫ్ జిల్లా, నియోజకవర్గ నాయకులు హాజరయ్యారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు

న్యాయం చేయాలి : ఎస్టీఎఫ్



మాట్లాడుతున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్టడీ లీవ్‌లో వెళ్లిన ఉపాధ్యాయుల స్థానాన్ని 8 సంవత్సరాలు పూర్తి కాకుండానే బదిలీలలో చూపించరాదని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కడప నగరం ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఓ నెంబర్ 342 ప్రకారం ఎస్సీ, ఎస్టీ వారికి ప్రభుత్వం కల్పించిన ఎడ్యుకేషన్ లీవ్ విత్ పే అలవెన్స్ కూడిన స్టడీ లీవ్‌కి వెళ్తే ఆ ఉపాధ్యాయుడు పనిచేసే స్థానాన్ని ఖాళీ చూపించడం సరి కాదన్నారు. ఇటీవల విడుదలైన బదిలీలు డ్రాఫ్ట్ చట్టంలో స్టడీ లీవ్‌పైన ఉన్నత విద్యలు అభ్యసించే ఉపాధ్యాయులు పాఠశాలలో అతని పోస్ట్ ఖాళీగా చూపుతున్నారన్నారు. దీని వల్ల ఆయా ఉపాధ్యాయులు స్టడీ లీవ్ పూర్తి చేసిన తర్వాత అతను ఎక్కడ ఉద్యోగం చేయాలన్నది అయోమయం పరిస్థితి ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షుడు నాగరాజు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు శ్రీరాములు, రవిశంకర్, సలాం తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ భవనం... అధ్వానం

- బాత్రూంల నీటితో లీకేజీలు
- తడిసిపోతున్న మందులు
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది





ఫార్మసీ విభాగం భవనం కప్పు లీకేజీ అవుతున్న దృశ్యం, తడిచిన మందులు

కడప సెవెన్‌రోడ్స్, మే 17 (ఆంధ్రజ్యోతి): రోగులకు జబ్బులను నయం చేయడానికి మందులు అందించే గది జబ్బున పడింది. ఇదేమిటని ఆశ్చర్యపోతున్నారా..! కడప సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసీ విభాగం భవనం చూస్తే పరిస్థితి అర్థమవుతుంది. వివరాల్లోకి వెళితే... నగర శివార్లలోని రిమ్స్ ఆసుపత్రిలో రోగులకు వైద్యం అందిస్తూ జబ్బులను నయం చేస్తుంటారు. కానీ అదే ఆసుపత్రికి జబ్బు చేస్తే పట్టించుకునే నాథుడే లేరు. దాదాపు 20 ఏళ్ల నుంచి సేవలు అందిస్తున్న ఆసుపత్రిలో సరైన నిర్వహణ లేక భవనాలు శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఫార్మసీ విభాగం భవనం అనేక చోట్ల లీకేజీలతో దర్శనమిస్తోంది. దీంతో రోగులకు జబ్బులను నయం చేయడానికి అందించే మందులు పనికిరాకుండా పోతున్నాయి. ఇక అత్యవసర సమయంలో రోగులకు వినియోగించే పరికరాలు సైతం పాడయ్యే పరిస్థితి ఉంది. దీంతో ఫార్మసి సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై ఫార్మసీ అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నా పట్టించుకునే వారే లేరు. ఇక కడప సర్వజన ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు మందు లిచ్చే ఫార్మసీ విభాగానికి ప్రత్యేక భవనం కూడా లేదు. పైపెచ్చు ఉన్న కాస్తోకూస్తో గదులను సైతం కాన్పులకు, గర్భిణీల ఓపీకి వినియోగించుకుంటున్నారు. దీంతో ఫార్మసీకి వచ్చే మందులు, ప్రతి రోజు వార్డుల నుంచి ఇండెంట్ తీసుకెళ్లే వారు, ఫార్మసీ సిబ్బందితో గందరగోళంగా ఉంటుంది. ఆసుపత్రులకు అన్ని విభాగాల వార్డులకు, సర్జరీలకు మందులిచ్చే ఫార్మసీ విభాగం ప్రత్యేక భవనం లేక, ఇరుకిరుకుగా, బాత్రూంల నుంచి వచ్చే నీటీ లీకేజీలతో నిత్యం ఇబ్బందుల నడుమ రోగులకు సేవలందిస్తున్నారు. ఫార్మసీ విభాగానికి ప్రత్యేక భవనం కేటాయించే వరకు, ప్రస్తుతం ఉన్న గదికి మరమ్మతులకు చేపట్టాలని ఫార్మసీ సిబ్బంది కోరుకుంటున్నారు.

అధికారులకు తెలియజేశాం..

ఫార్మసీ భవనం ఇరుకిరుకుగా ఉంది. మందులను నిల్వ చేయడానికి స్థలం సరిపోవడం లేదు. పైగా భవనం పైకప్పునకు లీకేజీలు ఉండడంతో బాత్రూంల నుంచి వచ్చే నీళ్లతో మందులు తడుస్తున్నాయి. అధికారులకు పలుమార్లు తెలియజేశాం.

-గీతా, ఫార్మసిస్టు, సర్వజన ఆసుపత్రి, కడప

ముంబై రోబోటిక్ కీళ్ల మార్పిడి సదస్సుకు జహంగీర్ బాషా



ముంబై కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డాక్టర్ జహంగీర్‌బాషా

కడప సెవెన్‌రోడ్స్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ఎస్.జహంగీర్ బాషా ముంబైలో వెలిస్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ లేటెస్ట్ టెక్నాలజీ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకొని విజయవంతంగా ఆదివారం కడప నగరానికి తిరిగి రానున్నారు. ఈ సందర్భంగా శనివారం ముంబై నుంచి ఫోన్‌లో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ముంబైలో జరిగిన కాన్ఫరెన్స్‌లో తాను కీళ్ల మార్పిడి టెక్నిక్‌ను ప్రదర్శించడం సంతోషంగా ఉందని, పలువురు సీనియర్ సర్జన్లు ప్రశంసించడం మరచిపోలేని అనుభూతినిచ్చిందన్నారు. ఇదే సదస్సులో కాలానుగుణంగా కొత్త సాంకేతికను అందిపుచ్చుకున్నట్లు తెలిపారు. రోబో ద్వారా మోకాళ్ల కీళ్ల మార్పిడి రాయలసీమ ప్రాంత ప్రజానీకానికి అతి తక్కువ ధరకే చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ విధానం ద్వారా వందశాతం ఖచ్చితత్వంతో కూడిన మోకాళ్ల మార్పిడి సర్జరీలు చేస్తున్నట్లు చెప్పారు. తద్వారా అతి తక్కువ కోత, వేగవంతమైన రికవరీ సమయం, చీము పట్టకుండా యాంటీబయాటిక్ కుట్లు వాడుతున్నామని తెలిపారు. స్టెయిన్ లెస్ స్టీల్ కోటెడ్, ల్యామినార్ ఎయిర్‌ఫ్లో ఆపరేషన్ థియేటర్లలో కేవలం అర గంటలోనే ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎప్పటికప్పుడు ఆర్థోపెడిక్ విభాగంలోనూ, అలాగే కీళ్ల మార్పిడిలో లేటెస్ట్ టెక్నాలజీ ద్వారా సీమ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా ప్రపంచ మార్కెట్‌లోకి వస్తున్న అత్యాధునిక వైద్య పరికరాలను కూడా జేబీ హాస్పిటల్‌లో అందుబాటులోకి తీసుకువచ్చామని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా, రాయలసీమలోనే మొట్టమొదటి అడ్వాన్స్‌డ్ లేటెస్ట్ రోబోటిక్ కీళ్ల మార్పిడి సర్జన్‌గా ఈయన ప్రసిద్ధిగాంచారు. రోబోటిక్ కీళ్ల మార్పిడి సర్జరీలను కడప నగరంలోని జేబీ హాస్పిటల్‌లో ఆయన విజయవంతంగా నిర్వహించారు. భారతదేశంలోని అతి కొద్దిమంది ప్రముఖ రోబోటిక్ కీళ్ల మార్పిడి సర్జన్లకు ముంబైలో నిర్వహించిన ఈ సదస్సుకు కడప నగరం నుంచి జహంగీర్ బాషా హాజరుకావడం పట్ల జేబీ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ అన్నారెడ్డి జయభారతి, జేబీ హాస్పిటల్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. రాయలసీమలోనే ప్రప్రథమంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబో అసిస్టెడ్ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించారు. ప్రపంచంలోనే కీళ్లమార్పిడలో 40 ఏళ్ల అనుభవం కలిగిన జాన్సన్ అడ్ జాన్సన్ కంపెనీ చేత చేయబడిన అత్యాధునిక లేటెస్ట్ టెక్నాలజీ కలిగిన రోబో వెలిస్ రోబో అన్నారు. అంతేకాకుండా స్టేట్ ఆఫ్ ఆర్ట్, ఫాస్ట్‌ట్రాక్ కీళ్లమార్పిడి కలిగిన ఏకైక హాస్పిటల్‌గా పేరుగాంచింది.

వైభవంగా వీరాంజనేయస్వామి తిరునాళ్లు





బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్

ఖాజీపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముత్తులూరుపాడు వీరాంజనేయస్వామి తిరుణాల శనివారం వైభవంగా నిర్వహించారు. తిరుణాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్‌లు బండలాగుడు పోటీలు ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన మొదటి బహుమతి పొట్టిపాడు లక్ష్మయ్య వృషభాలకు రూ.80 వేలు, రెండో బహుమతి చెన్నకేశవులు రూ.60 వేలు, మూడో బహుమతి విజయ ఓబుల్‌రెడ్డి రూ.40 వేలు, నాలుగో బహుమతి విశ్వనాధరెడ్డి వృషభాలకు రూ.30వేలు నగదు బహుమతిని ఆలయ కమిటీ సభ్యులు అందించారు. అలాగే స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురంరూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): పార్టీ విజయం కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణంలో మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర అబ్జర్వర్ మనోహర్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానాడు కార్యక్రమాన్ని మన నియోజకవర్గంలో నిర్వహించడం వల్ల మనందరిపై పెద్ద బాధ్యత ఉందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు. ముందుగా స్థానిక మూడు రోడ్ల కూడలి నందు టీడీపీ కార్యాలయం వరకు జాతీయ జెండాలు చేత బట్టుకుని ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసినందుకు జవాన్లకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో జరిగిన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, లోకేశ్ మనపై నమ్మకంతో పెద్దభారం పెట్టారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయవద్దన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, పాలకపక్షంలో ఉన్నా రాష్ట్ర కమిటీ ఏ కార్యక్రమం మొదలుపెట్టినా కమలాపురంలో నిర్వహించి విజయవంతం చేశామని తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలపై మహానాడులో సీఎం వివరిస్తారని తెలిపారు. ఇప్పటికే కమలాపురం నియోజకవర్గం అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామని.. అందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఒకరి చూపు.. మరొకరికి వెలుగు



పార్థివదేహం నుంచి కార్నియాలను సేకరిస్తున్న టెక్నీషియన్లతో స్నేహిత అమృత హస్తం సేవా సమితి సభ్యులు

పులివెందులటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ వ్యక్తి నేత్రాలు దానం చేయడంతో మరొకరి జీవితంలో వెలుగులు నింపాయి. సగిలి బసిరెడ్డి (79) శనివారం మరణించడంతో ఆయన నేత్రాలను దానం చేసేందుకు వారి కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈ క్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవా సమితి వారికి సమాచారం అందించారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని నివాసం వద్ద పార్థివదేహం నుంచి సేకరించిన కార్నియాలను మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యుల సమక్షంలో సేకరించి వాటిని హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీ కరించిన కుటుంబ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, శశిధర‌రెడ్డిలకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ వైఎస్ ప్రమీలమ్మ, పురప్రముఖులు, వైఎస్ మదన్‌మోహన్ రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, బంధువులు, సన్నిహితులు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ నిర్మాణ పనులు కూల్చివేత



తొలగింపు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న తహసీల్దారు, పోలీసులు

వల్లూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె సమీపంలో సర్వే నెం.87 వాగు పొరంబోకులో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణ పనులు చేశారని, వాటిని శనివారం తొలగించామని తహసీల్దారు శ్రీవాణి తెలిపారు. ఆమె వివరాల మేరకు.. పై సర్వే నెంబరులో వాగు పొరంబోకు, హైవే రోడ్డుకు దాదాపు పది సెంట్ల వరకు అక్రమంగా నిర్మాణ పనులను చేశారని, సదరు వ్యక్తికి రెవెన్యూ ద్వారా నోటీసులు కూడా అందించామన్నారు. అయితే ఎంతటికీ సమాధానం రాకపోవడంతో శనివారం ఈ అక్రమ కట్టడాన్ని తొలగించామని తహసీల్దారు తెలిపారు. అలాగే మండల పరిధిలో ఎవరైనా అక్రమంగా ప్రభుత్వ స్థలంలో కానీ వాగు పొరంబోకులో కానీ హైవే నిర్మాణం వద్ద పనులు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయరు హరి, స్థానిక వీఆర్వో అనంతరాజు, పంచాయతీ సర్వేయరు హైదర్‌అలీ పోలీసుల సమక్షంలో అక్రమ నిర్మాణాలు తొలగించారు.

తహసీల్దార్లపై కేసులు నమోదు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

కడప సెవెన్‌రోడ్స్, మే 17 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల నుంచి భూమిని కాజేసేందుకు వైసీపీ పక్కా ప్రణాళికతో ఫ్రీహోల్డ్ చట్టాన్ని తీసుకొచ్చిందని, రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితాలో ఉన్న భూముల ఫ్రీహోల్డ్‌లో అక్రమాలకు పాల్పడిన జిల్లాకు చెందిన తహసీల్దార్లను ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సిద్ధేశ్వరం బహిరంగసభను దిగ్విజయం చేయండి

కడప మారుతీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ పట్ల పాలకులు అవలంభిస్తున్న నిర్లక్ష్యం, వివక్ష కారణంగా అత్యంత వెనుకబడిన సీమ అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్న ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 31న సిద్ధేశ్వరం వద్ద తలపెట్టిన బహిరంగసభను విజయవంతం చేయాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ ప్రజలకు పిలుపునిచ్చారు. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రజా బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. ఆ మేరకు శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బహిరంగసభకు చెందిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు సలావుద్దీన్, ఓపీడీఆర్ నాయకులు పుత్తా శివారెడ్డి, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సగిలి గుర్రప్ప, వైహెచ్‌పీఎస్. నాయకులు శ్రీనివాసులు, హేతువాద సంఘం నాయకులు సీఆర్‌వీ ప్రసాద్‌రావు, డబ్ల్యూ రాము, టి. నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని తిరోగమనంలో తీసుకెళ్లద్దు

21న కడప డీఈఓ కార్యాలయం ముట్టడి



ఐక్యతను చాటుతున్న వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని తిరోగమనంలో తీసుకెళ్లవద్దని ప్రభుత్వానికి కడప జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. శనివారం కడప నగరంలోని యూటీఎఫ్ భవనంలో ఉపాధ్యాయ సంఘాల ప్రధాన బాధ్యుల సమావేశంలో ఎస్‌టీయూఏపీ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాష అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా విద్యాశాఖ చర్చల పేరుతో ఉపాధ్యాయ సంఘాలను మభ్యపెట్టిందని చర్చించేది ఒకటి, ఆదేశాలు మరొకలా ఉన్నాయని పేర్కొన్నారు. ఐక్యవేదిక కో కన్వీనర్ ఎంవీ శివారెడ్డి మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన చేపట్టనున్న డీఈఓ కార్యాలయ ముట్టడిని జిల్లాలోని ఉపాధ్యాయులందరూ జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్, ఏపీటీఎఫ్ 257, 1938, ఆపస్, ప్రధానోపాధ్యాయ సంఘం, రూట, వైఎస్ఆర్‌టీఏ, ఆర్జేయూపీ, ఎస్‌ఏపీఈ అసోసియేషన్, ఎస్‌పీఎస్టీయుఎస్, బీటీఏ, ఐటా, ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

చెన్నూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): యల్లమ్మ జాతరను ప్రశాంత వాతావరణంలో జరుపు కోవాలని కడప డీఎస్పీవెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో శనివారం ఇరువర్గాలను పిలిపించి సమస్యలు లేకుండా జాతర సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఆచారాలు పక్కన పెట్టకుండా సాంప్రదాయాలు వదలకుండా ప్రతి ఒక్కరూ సహకరించుకుంటూ ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలన్నారు. అలాగే జాతర కోసం అవసరమైన బందోబస్తు నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కె.విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివరామిరెడ్డి, హిందూ ఐక్యవేదిక అధ్యక్షుడు జీఎన్ భాస్కర్‌రెడ్డి, బలిజ సంఘం నాయకులు ఆకుల ప్రసాద్‌బాబు, మైనార్టీ నాయకులు అన్వర్, అష్రఫ్, వారిష్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

సీకేదిన్నె, మే 17 (ఆంధ్రజ్యోతి): రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం అప్పరాజుపల్లెలో శనివారం మహానంది వ్యవసాయ కళాశాల 4వ సంవత్సరం విద్యార్థులు ఏర్పాటు చేసిన రైతు,వ్యవసాయ సదస్సును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏరువాకకేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్, ఆత్మా పీడీ విజయలక్ష్మి, విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మహేష్‌బాబు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత

సింహాద్రిపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరతతో ప్రజలకు సకాలంలో సేవలు అందించేందుకు రెవెన్యూ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సింహాద్రిపురం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, మండల సర్వేయర్, బలపనూరు, కోవరంగుట్టపల్లి వీఆర్వోలు, పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో కార్యాలయం పనులు నెట్టుకు రావడం తీవ్ర ఇబ్బందిగా ఉన్నట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీహరిబాబు తెలిపారు. కేవలం కంప్యూ టర్ ఆపరేటర్లపై ఆధారపడి కార్యాలయ పనులు చేసుకోవాల్సి వస్తోందన్నారు. ఇటు కార్యాలయానికి నిత్యం వచ్చే ప్రజల సమస్యలు, అటు ఉన్నతాధికారులు అడిగే వివరాలు సకాలంలో అందిం చాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించి ప్రజల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరారు.

పర్యావరణాన్ని కాపాడుదాం





మొక్కలు నాటుతున్న ఎస్పీ అశోక్‌కుమార్, పులివెందులలో ర్యాలీ నిర్వహిస్తున్న అన్ని పార్టీల నాయకులు, మున్సిపల్ సిబ్బంది

కడప క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీసు సంక్షేమ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు, ఆర్‌ఐలు టైటస్, వీరేశ్, శ్రీశైలరెడ్డి, యూనిట్ డాక్టర్ మేరీ సుజాత, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కడప ఎన్టీఆర్ సర్కిల్..: రానున్నవర్షాకాలంలో ప్రతి ఒక్కరూ ఇంటికి కనీసం రెండు మొక్కలైనా నాటాలని స్టెప్ సీఈవో సాయిగ్రేస్ అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధనలో భాగంగా కలెక్టరేట్‌లోని డి-బ్లాక్‌వద్ద శనివారం స్టెప్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్టెప్ సిబ్బంది నారాయణ, అబ్బాస్, సుబ్బరాయుడు, నాగయ్య పాల్గొన్నారు.

కమలాపురం రూరల్..: పట్టణ ప్రజలు వేసవిలో అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మేరీ సూచించారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమెతో పాటు మున్సిపల్ కమిషనరు పగడాల జగన్నాథం పాల్గొన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి, ఉపాధి పనుల ఏపీవో పంచాయతీ సెక్రటరీ నాగమణి పాల్గొన్నారు.

వల్లూరు..: ప్రతి నెలా మూడో శనివారం రోజున నిర్వహించే స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని మండల కేంద్రమైన వల్లూరులోని గణేశ్‌పురం వద్ద ఎంపీడీవో రఘురాం ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే గణేశ్‌పురం వద్ద మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీధర్, ఏపీవో సుధారాణి, సీహెచ్‌వో వేణుగోపాల్, సచివాలయ సిబ్బంది, ఎమ్మార్పీ నాగమణి, అన్ని శాఖల అధికారులు, ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు.

కడప(వినాయకనగర్)..: స్వచ్ఛాంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థినులను వేడి గాలుల పట్ల అవగాహన, అప్రమత్తత కార్యక్రమావెబినార్ ద్వారా నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వీ. శ్రీరాములరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఖాజీపేట మండలం విడతూరు పీహెచ్‌సీ వైద్య అధికారి డాక్టర్ అర్చన మాట్లాడారు. సమన్వయకర్త డాక్టర్ రాజమోహన్‌రెడ్డి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్..: ప్లాస్టిక్‌రహిత సమాజాన్ని నిర్మించాలని అందుకు ప్రజల సహకారం కావాలని మున్సిపల్ కమిషనరు రాముడు అన్నారు. స్వచ్ఛఆంధ్ర, స్వర్ణాంధ్ర, బీట్ ది హీట్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనరు రాముడు, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ వి.వరప్రసాద్‌తో కలిసి స్థానిక భాకరాపురంలో నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటరులో మొదట మొక్కలు నాటి అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మానవ హారంగా స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టరు మహబూబ్‌బాషా,బీజేపీ నాయకులు శశిభూషణ్‌రెడ్డి, కౌన్సిలరు, వార్డు సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వేముల..: మండల కేంద్రమైన వేములలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పాత గ్రామ సచివాలయం నుంచి కడప-పులివెందుల ప్రధాన రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞచేశారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, పేర్ల శేషారెడ్డి, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

కేసీ కాల్వలో పూడికతీత కోసం నీరు ఆపండి : ఎమ్మెల్యే



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

చెన్నూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్‌లో వేసవిలో పూడిక తీత పనులు చేపట్టాలంటే ముం దు కాల్వలకునీరు రాకుండా చూడాలని, ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టవచ్చని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శనివారం చెన్నూరుకు వచ్చిన ఆయనను పలువురు రైతులు కలిసి ఈ వేసవిలో కేసీ ప్రధాన కాల్వ, ఉప కాల్వలు శుభ్రం చేయాలంటే వెంటనే నీరు నిలపాలన్నారు. ఇప్పటికే కాల్వల పొడవునా పలురకాల తీగ జాతి మొక్కలు గుర్రపుడెక్క పెరిగిపోయాయని, కాల్వ అన్న రూపు రేఖలే కనిపించకుండా ఉన్నాయని వారన్నారు. వీటిని తొలగించాలంటే నీరు ఆపి ఉపాధి పథకం ద్వారా పనులు చేపట్టాలని వారు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే అక్కడున్న ఏపీవో శైలజతో మాట్లాడడంతో కేసీకెనాల్ ఏఈకి తక్షణం కాల్వకు నీరు నిలపాలని పంట కాలం కూడా అయిపోయింది కదా అని చెప్పడం జరిగింది. అలాగే స్థానిక సీఐ క్రిష్టారెడ్డితో మాట్లాడుతూ కొండపేట వంతెనపై చీకడి పడ్డతరువాత మద్యం తాగడం కానీ, అక్కడ పలురకాల తినుబండారాలు తిని వ్యర్థాలు వేయడం కానీ లాంటివి చేయకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే శ్మశానానికి వెళ్లే దారిలో పెరిగిన కలుపును ఎమ్మెల్యే డీపీవో రాజ్యలక్ష్మితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా ఓ మహిళ తనకుపక్కాగృహం ఇంకా చేతికి ఇవ్వలేదని తాము ఇల్లు లేక ఇబ్బంది పడుతున్నా మని ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే హౌసింగ్ ఏఈ మినల్‌కుమార్‌ను పిలిపించి 1వతేదీ నాటికి ఈ మహిళకు ఇల్లు పూర్తి చేసి అప్పగించాలన్నారు.

పారిశుధ్య కార్మికులు తమకు జీతాలు పెంచాలన్నారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తలు సైతం తమ సమస్యలపై సీఎం దృష్టికి తీసుకుపోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పెడబల్లె శ్రీకాంత్‌రెడ్డి,పెడబల్లె కార్తీక్‌రెడ్డి, మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి జ్ఞాపకాలు ఎంతో మధురం

కడప మారుతీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆనాటి పాఠశాలలో చదివిన జ్ఞాపకాల దొంతరలను మరో సారి నెమరేసుకునేలా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ద్వారా కలుసుకోవడం చాలా ఆనందంగా వుందని నగర మరియాపురం సెయింట్ జోసెఫ్ హైస్కూల్ 1977-78 బ్యాచ్ ఆ హైస్కూల్ ఎస్‌పీఎల్. కోనేటి వెంకటసుబ్బయ్య అన్నారు. శనివారం స్థానిక ఐఎంఏ హాలులో నాటి 1977-78 సంవత్సరపు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి సుమారు 50 మంది విద్యార్థులు హాజరై చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఒకరినొకరు శుభాకాంక్షలు, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాటి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. జోజిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఇలియాస్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎన్. భాస్కర్‌రెడ్డి, రమణగుప్త, శివమోహన్, నాగేంద్రప్రసాద్, రవీంద్ర ప్రసాద్, రాజు, శేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్‌సెల్ వినతులను వెంటనే పరిష్కరించాలి

ఆర్డీఓ చిన్నయ్య



పులివెందుల, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్‌సెల్‌లో ప్రజల నుంచి వచ్చే వినతులను వెంటనే పరిష్కారించేలా తహసీల్దార్‌లు చొరవ చూపాలని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, డీటీలు, ఆర్‌ఐలు, వీఆర్వోలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాలు, పంచాయతీలలో పర్యటించి సమస్యలు లేని పంచాయతీలుగా గుర్తిస్తే ఆ పంచాయతీకి గోల్డెన్ విలేజ్‌గా గుర్తింపు లభిస్తుందన్నారు. ఇప్పటికే కలెక్టర్ ఈ విధానాన్ని ప్రకటించారన్నారు. ఇందులో కడప డివిజన్‌లో దాదాపు 200గ్రామాలు గోల్డెన్ విలేజ్‌లుగా ఉన్నాయన్నారు. పులివెందుల డివిజన్‌లో ఇప్పటి వరకు గోల్డెన్ గ్రామాలను గుర్తించలేదన్నారు. వెంటనే రెవెన్యూ సిబ్బంది కృషిచేసి గోల్డెన్ విలేజ్‌గా తీర్చిదిద్దాలన్నారు.

వైభవంగా పగడాలపల్లె గంగమ్మ తిరునాళ్లు

పెండ్లిమర్రి, మే 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పగడాలపల్లె సమీపంలో వెలసిన గంగమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగింది.కార్యనిర్వాహకులు గంగిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కోలాటం, బండలాగుడు పోటీలు ,అన్న సంతర్పణ నిర్వహించారు.బండలాగుడు పోటీల్లో మొదటి స్థానం లక్షరూపాయలను గురివిరెడ్డి,రమేష్ బాబు ఎద్దులు గెలుచుకున్నాయి.

పులివెందుల వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న షేక్ మహ్మద్ ఆలీ

పులివెందుల టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ అనంతపురంలో కెమిస్ట్రీలో షేక్ మహ్మద్ ఆలీకి డాక్టరేట్ (పీహెచ్‌డీ) లభించింది. శనివారం మున్సిపాలిటీలోని జెండామానువీధికి చెందిన షేక్ మహబూబ్‌బాషా పెద్దకుమారుడు షేక్‌మహ్మద్ ఆలీకి 2025 మే 17న విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవ వేడుకలో ఏపీ గవర్నరు సయ్యద్‌అబ్దుల్ నజీర్, జేఎన్టీయూ ఏ అనంతపురం వైస్‌ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు ఈ ప్రతిష్టాత్మక గౌరవాన్ని ఆయనకు ప్రదానం చేశారు. ఎల్‌సీ ఎంఎస్.ఎమ్మెస్ ఉపయోగించి ఫార్మాస్యూటికల్ డ్రగ్స్‌లో జెనోటాక్సిస్ ఇంప్యూరియస్ ఫార్మస్యూటికల్స్ డ్రగ్స్‌లో జెనోటాక్సిక్ ఇంప్యూరిటీస్ గుర్తింపు, పరిమాణీకరణ కోసం విశ్లేషణాత్మక పద్ధతుల అభివృద్ధి, వాలిడేషన్ అనే పరిశోధనకు డిగ్రీ లభించింది.

ప్రజల వద్దకే రెవెన్యూ సేవలు



రెవెన్యూ కోర్టు కార్యక్రమం నిర్వహిస్తున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

కమలాపురం రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో అందే విధంగా ప్రజల వద్దకే సమస్యల పరిష్కారవేదిక ఏర్పాటు చేస్తున్నామని ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రజల వద్దకు రెవెన్యూ సేవలు రెవెన్యూ కోర్టు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరాంరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు అహల్య పాల్గొన్నారు.

రేపు నియోజకవర్గ స్థాయి టీడీపీ మహానాడు

పులివెందుల, మే 17 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గానికి సంబంధించి 19వ తేదీ సోమవారం మహానాడు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ న్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) శనివారం ఒక ప్రకటన విడుదలచేశారు. ఈనెలలో జరగనున్న టీడీపీ మహానాడు కార్యక్రమానికి పార్లమెంట్‌స్థాయి మహానాడు కార్యక్రమం నిర్వహించాలని టీడీపీ పిలుపునిచ్చిందన్నారు. ఈ మేరకు 19వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3గంటల నుంచి స్థానిక టీడీపీ కార్యాలయంలో మహానాడు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

తిరంగా ర్యాలీ: భారతసైన్యం పాక్‌పై సాధించిన విజయానికి సంఘీభావంగా పులివెందులలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గస్థాయి టీడీపీ మహానాడు కార్యక్రమం అనంతరం సాయంత్రం 5గంటలకు ఎన్‌డీఏ కూటమి నాయకులు ఈ తిరంగా ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ ర్యాలీ కూటమి ఆ్వర్యంలో సాగిస్తున్నట్లు నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చింది.

నేడు అవగాహన సదస్సు

కడప మారుతీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టంపై ఈనెల 18వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు నగర ప్రెస్‌క్లబ్‌లో తలపెట్టిన అవగాహన సదస్సు కు అందరూ హాజరై అవగాహన చేసుకోవాలని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం కడపలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ నాయకుడు సత్తార్ పాల్గొన్నారు.

ఫిల్టర్ పేపర్, లీటర్ల కొలతను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

కడప నాగ రాజు పేట, మే 17 (ఆంధ్రజ్యోతి): వినియోగ దారులకు ఇంధన నాణ్యత పరిశీలించేందుకు ఫిల్టర్ పేపర్,కొలత పరి మాణం పరిశీలించేందుకు 5 లీటర్‌ల కొలతను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ, కడప, బీపీసీఎల్ సేల్స్ ఆఫీసర్ నరేంద్రరెడ్డి తెలిపారు. ప్రపంచ మెట్రాలజీ వారోత్సవాల సందర్భంగా లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో శనివారం పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్రాలజీ చట్టం, రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని, విధిగా రూల్స్ పాటించాలని ఆఫీసర్ నరేంద్రరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీల డీలర్స్ పాల్గొన్నారు.

జేఎన్టీయూలో గవర్నర్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్సీ



పులివెందుల, మే 17 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని జేఎన్టీయూనివర్సిటీలో జరిగిన 14వ స్నాతకోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి స్వాగతం పలికారు. శనివారం అనంతపురం జేఎన్టీయూలో స్నాతకోత్సవ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ తరపున రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఆయన వస్తున్న సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అక్కడకు వెళ్లి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు.

ఎమ్మెల్సీ పరామర్శ..: మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వల్లెపు ఆదినారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పరామర్శించారు. ఆదినారాయణ ఆటో ప్రమాదంలో మరణించడం బాధాకరమని పార్టీ అండగా ఉంటుందని ఆయన ధైర్యం కల్పించారు. వారి కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు



చెత్తను తొలగిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీ పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా పడకేసిన పట్టించుకునే వారు కరువయ్యారని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతనిధి తులసిరెడ్డి తెలిపారు. పారిశుధ్యంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. మెయిన్ బజార్‌లోని పలు వీధుల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లె పారశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంత అధ్వానంగా ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోకపోవడం శోచనీయమన్నారు. పులివెందుల ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిలకడగా చీనీ ధరలు

పులివెందుల టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో చీనీ ధరలు నిలకడగా ఉంటున్నాయి. టన్ను ధర కొన్ని రోజులుగా రూ.20వేల నుంచి రూ.30వేల మధ్య పలుకుతున్నాయి. మూడు నాలుగు రోజులుగా టన్ను రూ.43,100 గరిష్ట ధరలు పలుకుతున్నాయి. శనివారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.43100 కనిష్టంగా రూ.17వేలు, మధ్యస్తంగా రూ.23100 అమ్ముడుబోయినట్లు మార్కెట్ ఎంపిక సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

కడప సెవెన్ రోడ్స్, మే 17 (ఆంధ్రజ్యోత): అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ విమర్శించారు. శనివారం సీపీఐ నగరపార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాల మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 19వ తేదీన కడప తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సభ్యులు మల్లికార్జున, నారాయణ, దస్తగిరమ్మ, రాముడు,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పార్కింగ్ లేక ఇక్కట్లు

● ప్రధాన రహదారిపైనే వాహనాలు నిలిపిన వైనం ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● కనపడని ట్రాఫిక్ నియంత్రణ చర్యలు

పోరుమామిళ్ల, మే 17 (ఆంధ్రజ్యోతి) :పట్టణ జనాభాతోపాటు వాహనాల సంఖ్య పెరిగే కొద్దీ పార్కింగ్ స్థలాల్లే ప్రధాన రహదారిపైనే ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగి అటు పట్టణవాసులు ఇటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పోరుమామిళ్లలో కాలానుగుణంగా షాపులు పెరగడం, గ్రామీణ ప్రాంతాల్లోని వారు పోరుమామిళ్లకు రావడంతో వాహనాల సంఖ్య పెరిగి పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లుక్కనే వాహనాలు నిలిపి వ్యాపార లావాదేవీలు చూసుకుని తాపీగా పని పూర్తయ్యేక వెలుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోరుమామిళ్ల రోడ్డు విస్త రణ పనులకు సంబంధించి రోడ్డు 80 అడుగుల వెడల్పుతో డ్రైనేజీ ప్లాట్‌ఫారం, రోడ్లు నిర్మించాలని టెండర్లు జరిగి పనులు జరిగినా అర్థాంతరంగా అవి ఆగిపోవడంతో వాహనదారులకు ప్రజలకు ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఉన్న రోడ్డు కుదించుకుపోవడం, టూవీలర్ కూడా పెట్టుకోవడానికి స్థలం లేకపోవడంతో షాపుల ముందు వాహనాలను నిలిపివేస్తున్నారు. అంతేకాక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రోడ్డు పక్కనే కార్లు, జీపులు పెట్టడంతో వాహనాల రాకపోకలకు ప్రజలు రోడ్డు దాటాలన్నా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సమీపంలో బ్యాంకుకు వచ్చే వారికి పార్కింగ్ స్థలంలేకపోవంతో రోడ్డు పైనే వాహనాలు నిలుపుతన్నారు. అలాగే స్టేట్‌బ్యాంకు వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పోరుమామిళ్లలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. మహాత్మాగాంధీ విగ్రహం సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, వరికుంట్ల బస్టాండు ఏరియాలో ఎక్కువగా జన సమూహం ఉంటుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి హెచ్చరికలు జారీ చేసినా షరా మామూలే అన్నరీతిలో వాహనాలను రోడ్లపక్కనే నిలుపుతున్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయ. గతంలో కొన్ని ప్రాంతాల్లో ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలున్నాయి. మరి రోడ్ల విస్తరణ పనులు తిరిగి మరలా ఎప్పుడు ప్రారంభిస్తారో? పార్కింగ్ స్థలాలు ఎక్కడ కేటాయించి సమస్యలేకుండా చేస్తోరోనని పోరుమామిళ్ల ప్రజలు ఎదురు చూస్తున్నారు.



పోరుమామిళ్లలో రహదారుల పక్కనే నిలిపిన ద్విచక్ర వాహనాలు

రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే సమస్య ఉండదు

రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాక పార్కింగ్ సమస్య తీరుతుంది. ప్రస్తుతం పట్టణంలో ఉదయం నుంచి రాత్రి వరకు పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తున్నాం. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే జరిమానా విధిస్తాం. ప్రజలు కూడా సహకరించాలి.
-శ్రీనివాసులు, సీఐ, పోరుమామిళ్ల

వెల్లాల దేవస్థానానికి హుండీ ఆదాయం రూ.5.42 లక్షలు



వెల్లాల దేవస్థానంలో హుండీ లెక్కింపు జరుగుతున్న దృశ్యం

రాజుపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి): వెల్లాల చెన్నకేశవ సంజీవరాయస్వామి భీమలింగేశ్వర స్వామి దేవస్థానానికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా హుండీ ద్వారా పదిరోజులకు రూ.5,42,314 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కేవీ రమణ తెలిపారు. హుండీ పదిరోజుల తాత్కాలిక లెక్కింపును శనివారం సహాయ కమిషనరు మల్లికార్జున ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, టీడీపీ నాయకుడు సుబ్బిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

బ్యాంక్ అభివృద్ధిలో భాగస్వామ్యులు కండి



డిపాజిట్ దారుడికి బాండు అందజేస్తున్న ఏపీజీబీ ఆర్ఎం సుశాంత్‌కుమార్ స్వాహో

కాశినాయన మే17(ఆంధ్రజ్యోతి): ఏపీజీబీ బ్యాంక్ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని ఆశాఖ రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్ స్వారో పిలుపునిచ్చారు.శనివారం ఇటుకుల బ్యాంక్ ఆవరణలో గ్రామస్థులు ఖాతాదారులతో ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ పొదుపుదారులు చేసే డిపాజిట్లకు ఆశాజనకమైన వడ్డీలు మాబ్యాంక్ అందిస్తుందన్నారు.

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

కాశినాయన మే17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకులపాడులో శనివారం ముచుకుందేశ్వర జ్ఞాన ప్రసూనాంబ ఆలయంతోపాటు గొంటువారిపల్లెలో పోలేరమ్మ ఆలయ శిఖర కలిశ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుపాటు సాగే ఈకార్యక్రమంలో మొదటిరోజైన శనివారం హోమాలు యాగాలు ఘనంగా సాగాయి. వర్షం కారణంగా బండలాగుడు పోటీలు, పలు సాంస్కృతికి కార్యక్రమాలు రద్దయ్యాయి.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

జమ్మలమడుగు, మే 17 (ఆంధ్రజ్యోతి): పెద్ద దండ్లూరు గ్రామంలో శనివారం సీఎస్ఐ చర్చి 10వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ రామాంజనేయరెడ్డి, హాజరయ్యారు. చర్చి ప్రాంగణంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి నాయకులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, రామాంజనేయ రెడ్డి, రమేష్‌రెడ్డి, చర్చి ఫాదర్లు పాల్గొన్నారు.

కొండాపురంలో దంచికొట్టిన వర్షం

కొండాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి దాకా వర్షం దంచి కొట్టింది .కొండాపురంతో పాటు పలు గ్రామాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల వాగులు, వంకలు పొర్లి ప్రవహించాయి. వేసవితాపంతో అల్లాడుతున్న జనానికి ఈ వర్షం ఉపశమనం ఇచ్చిందని చెప్పవచ్చు . బోర్లలోకి నీరు కూడా పెరుగుతుందని రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజుపాలెంలో: ఉక్కబోతతో అల్లాడుతున్న ప్రజలకు ఒక్కసారిగా శనివారం 5గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వర్షం కురియడంతో వాతావరణం చల్లబడి కాస్త ఉపశమనం కలిగింది. కరెంటు అంతరాయం కలిగినా వర్షం పడడంతో ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో శనివారం సాయంత్రం 5.45 గంటల నుంచి గాలీ, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. శ్రీనారాపురం వెంకటేశ్వరస్వామి రథోత్సవం సాయంత్రం 5 గంటలకు ముగిసిన తర్వాత గాలులు వీచాయి. దీంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడారు. సాయంత్రం చల్లని గాలి, ఆలయ ప్రాంగణంలో వర్షం కురవడంతో చల్లని వాతావరణం ఏర్పడింది.

పోరుమామిళ్లలో: కొద్దిపాటి వర్షానికే పోరుమామళ్లలో రహదారులు జలమయమై నీటి కుంటలను తలపిస్తున్నాయి. సరిగా రోడ్లు కాల్వలు లేకపోవడంతో గుంతలు ఏర్పడి వర్షం నీరంతా గుంతల్లో చేరుకోవడంతో వాహనదారులు కింద పడ్డారు. రంగసముద్రం పంచాయతీ పరిధిలోని పెట్రోలు బంకు సందులో ఆర్అండ్‌బీ రోడ్డు నీటి కుంటలను తలపించింది.

మున్సిపాలిటీకి తుక్కు వస్తువుల వేలం ద్వారా రూ.5.03 లక్షలు ఆదాయం

ప్రొద్దుటూరు , మే 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ , వాటర్ సప్లయి ,ఎలక్ట్రికల్ డిపార్ట్ మెంట్‌లోని తుక్కు వస్తువులకు నిర్వహించిన ఈ వేలంలో రూ.5,03,835 మున్సిపాలిటీకి ఆదాయం సమకూరినట్లు కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శనివారం 13.02 టన్నుల ఇనుప తుక్కు వస్తువులకు ఈ వేలం నిర్వహించగా మున్సిపాలిటీకి భారీగా ఆదాయం సమకూరినట్లు కమిషనర్ మల్లికార్జున వెల్లడించారు.

నరసింహుడికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి):వల్లెరవారిపల్లెలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల ప్రజలు స్వామివారిని దర్శించుకున్నా రు. పలురకాల పూలతో స్వామివారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. వల్లెరవారిపల్ల గ్రామానికి గుర్రంపాటి వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

వారాహి అమ్మవారికి పూజలు

ప్రొద్దుటూరు టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): అమ్మవారిశాలలో శ్రీ శక్తిపీఠం పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని ఆధ్వర్యంలో వారాహి దేవి అమ్మవారికి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలకరించారు. వారాహి అమ్మవారికి కుమార్చన నిర్వహించారు.

ఎస్ఆర్ఐటీ విద్యార్థికి బంగారు పతకం



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న మహమ్మద్ అక్రమ్

ప్రొద్దుటూరు టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనంతపురం విశ్వవిద్యాలయం పరిధిలో అకడమిక్ విభాగంలో ప్రతిభ కనపరిచిన ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి సయ్యద్ మహమ్మద్ అక్రమ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. ఆ విద్యార్థి అకడమిక్ పరీక్షలను మెకానికల్ విభాగంలో 86.50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. శనివారం జేఎన్‌టీయూ అనంతపురంలో జరిగిన యూనివర్సిటీ 14వ వార్షికోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మకమైన బంగారు పతకం, ప్రశంసా పత్రం అందుకున్నారు. గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్న ఆ విద్యార్థిని కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి, చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

బద్వేలుటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని బద్వేలు అర్బన్‌సీఐ రాజగోపాల్ అన్నారు. శనివారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మధ్య రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతూ, కొంత మంది మంచాలకు పరిమితమవుతున్నారని ఆయన అన్నారు. రోడ్లపై ద్విచక్రవాహనాలు నడుపుతున్న కొంత మంది నిర్లక్ష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటున్నారన్నారు. అంతా సవ్యంగా సాగినప్పుడు ఏ ఇబ్బంది ఉండదని, కానీ ఊహించని విధంగా ప్రమాదానికి గురైతే రోడ్డుకు తలతగిలి వారి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. పోలీసు అధికారులు పదే పదే చెబుతున్నా చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాలను రోడ్డునపడేస్తుందని, ప్రతి ఒక్కరూ తిరిగి గమ్యస్థానాలను చేరే వరకు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

విద్యారంగ అభివృద్ధే ఎస్టీయూ ధ్యేయం



పదో తరగతిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్టీయూ నాయకులు

పోరుమామిళ్ల మే 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, విద్యారంగ అభివృద్ధి ధ్యేయంగా ఎస్టీయూ పనిచేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి రాష్ట్ర కమిటీ కన్వీనరు సుబ్రమణ్యం పేర్కొన్నారు. శనివారం పోరుమామిళ్ల ఎస్టీయూ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కలసపాడు, కాశి నాయన, బికోడూరు పోరుమామ్ళి మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేసే ఏకైక సంఘం ఎస్టీయూ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలరు చంద్రహాసరెడ్డి బాలరాజు, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, కస్తూరి శ్రీనివా సులు, సౌజన్య, శ్రీలతపాల్గొన్నారు.

ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి



మహిళా రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శ్రీనివాసులు

బ్రహ్మంగారిమఠం, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయాధికారి శ్రీనివాసులు తెలిపారు. శనివారం బ్రహ్మంగారి మఠం మండలంలోని వాంపల్లెచెరువు గ్రామంలో గ్రామస్థాయిలో ప్రకృతి వ్యవసాయం గురించి ఖరీఫ్ ప్రణాళిక ఏ విధంగా చేపట్టాలన్న అంశంపై రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుత సీజనులో 20 రకాల విత్తనాలు పంట పొలాల్లో చల్లుకుని భూమిలో కలియదున్న డం వల్ల సేంద్రియ కర్బనం క్రమేణా పెరిగి రైతు వేసిన ప్రధాన పంటలు ఆరోగ్యం గా పెరిగి పంట మంచి దిగుబడి చెందుతుందన్నారు. ప్రస్తుతం 11పంచాయతీల్లో ఐదు పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం చేపడుతున్నామని త్వరలోనే అన్ని పంచాయతీల్లో అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ దేవిరాణి, సీసీ సుబ్బరాయుడు, రైతన్నలు, డ్వాక్రాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రతను పెంపొందించాలి

ప్రొద్దుటూరు టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టిందని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. మూడవ శనివారం సందర్భంగా విద్యార్థులు కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి డాక్టర్ ఇందిర, డాక్టర్ జీవన్, భరత్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో: మండల కేంద్రంలో స్వచ్ఛాంధ్రజ.. స్వర్ణంధ్ర కార్యక్రమంపై ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తిరుగుతూ ప్రతి గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై ర్యాలీలో ప్లకార్డులతో తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మల్లేపల్లె సర్పంచ్ నారాయణ, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, మండల టీడీపీ ఉపాధ్యక్షులు శీలం నరసింహగౌడ్, చిలమల నాగయ్య, పూజా శివయ్యయాదవ్, పాల్గొన్నారు. నందిపల్లె గ్రామంలో ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లను స్థానిక టీడీపీ నేతలు బీమానాయుడు, సురేశ్, సుమన్ తదితరులు పంపిణీ చేశారు.

ప్రొద్దుటూరు అభివృద్ధిపై ఫోకస్ పెంచాలి

● కలెక్టరేట్‌లో ప్రొద్దుటూరు అభివృద్ధి పై అధికారుల సమీక్షలో కలెక్టర్



ప్రొద్దుటూరు అభివృద్ధిపై సమీక్షలో ఎమ్మెల్యే, కలెక్టర్, జేసీ

ప్రొద్దుటూరు , మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు అభివృద్ధిపై అధికారులు ఫోకస్ పెంచాలని జిల్లా కలెక్టర్ చెరుకూరిశ్రీధర్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అధికారులకు సూచించారు. శనివారం కడప కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ, కమర్షియల్ మార్కెట్ అభివృద్ధి , మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణ తదితర అభివృద్ధి పనులపైన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రొద్దుటూ రులో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచేందుకు ఖచ్చితమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. జనాభా వివరాలతో పాటు విస్తీర్ణం, నిధులు ఏ మేరకు అవసర మౌతాయో అంచనాలు తయారు చేయాలన్నారు. ఓపెన్ తోపాటు అండర్ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి పరచాల్సివుందన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో నూతన మాస్టర్ ప్లాన్ ప్రకారం విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్లు, కాలువ నిర్మాణాలకు అండర్ డ్రైనేజీ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. వాటర్ సప్లయిని మెరుగు పరిచేందుకు కృషి చేయాలన్నారు. ఇరిగేషన్ ఛానల్స్ పై ఆక్రమణలు తొలగించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అతిధి సింగ్ , ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తహసీల్దారు గంగయ్య, మున్సిపల్ ఈఈ ప్రభాకర్‌దాస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

శ్మశానాలకు కొత్తగా సౌకర్యాలు ఏర్పాటు

● ఎన్నికల హామీ నెరవేర్చుతున్నా.. ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్

చాపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు శ్మశానాలకు కొత్తగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. అన్నవరం, భద్రిపల్లె గ్రామాల్లో శ్మశానాలకు ఎమ్మెల్యే శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రతి శ్మశానానికి రూ.20 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. మైదుకూరు నియోజకవర్గంలోని దువ్వూరు, బి.మఠం, ఖాజీపేట, మైదుకూరు, చాపాడు మండలాల్లో అయిదు శ్మశానాలకు చొప్పున పైలెట్ ప్రాజెక్టుగా శ్మశానాలకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, కేసీకెనాల్ కమిటీ వైస్‌చైర్మన్ గురివిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వీరనారాయణ, మునిశేఖర్‌రెడ్డి, సుదర్శన్, బాబు, హర్షవర్ధన్‌రెడ్డి, నారపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరురూరల్:మైదుకూరు మండలంఢాంఖాన్‌పల్లె గ్రామంలో శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్ భూమి పూజ చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేటలో: ఏటూరు స్మశాన వాటికకు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్ భూమి పూజ చేపట్టారు.కార్యక్రమంలో మిల్లు శ్రీను, చంద్ర ఓబుల్‌రెడ్డి, హరినాధరెడ్డి, ప్రతాప్ రెడ్డి, నంద్యాల సుబ్బయ్య, గోవిందు సుబ్బయ్య, అధికారులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంచి పర్యావరణాన్ని రక్షించండి



మున్సిపల్ పార్కులో మొక్కలు నాటుతున్న కమిషనర్, తదితరులు

ప్రొద్దుటూరు/రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి):పచ్చదనం పెంచి పర్యావరణాన్ని రక్షించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పార్కు , మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్షుల కోసం నీటి సౌకర్యం ఏర్పాటు చేపట్టాలన్నారు. వేసవి ఎండలు ఉన్నందున వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ మజ్జిగ మంచినీళ్ల తాగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ప్రభాకర్ దాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా, సుబ్బరాయుడు పాల్గొన్నారు. ప్రజా ఆరోగ్య సమస్యలతో పాటు వేసవిలో తలెత్తే సమస్యలపై ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నాగ శశిభూషన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్రా-స్వచ్ఛ ఆంధ్రాలో భాగంగా వేడిమిని ఎదుర్కోవడం అనే అంశంపై దొరసానిపల్లిలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న వృద్ధాశ్రమంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించి 41 మందికి వైద్య సేవలు అందించారు. ఆప్తాల్మిక్ అధికారి తేజ సీనియర్ సిటిజన్‌లకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కృష్ణమ్మ, సూపర్‌వైజర్ వరప్రసాద్, చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. కొత్తపల్లిలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. ఖాదర్‌బాదు గ్రామంలో స్వర్ణాం ధ్ర-స్వచ్ఛఆంధ్ర ర్యాలీ, అవగాహన కార్యక్రమాలను చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్ర మంలో ఈవోపీఆర్డీ రామాంజినేయరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు


బద్వేలులో: బద్వేలు పట్టణంలో శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్టీసీ బస్టాండు ఆవరణలో పరిసరాలు పరిశుభ్రం చేశారు. అలాగే స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించి ఎండ వేడిమి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రమోహన్, మున్సిపల్ చైర్మన్ వెంకటనరసింహారెడ్డి, ఆర్టీసీ డీఎం నిరంజన్, అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, ఫారెస్టు అధికారులు పాల్గొన్నారు.



స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛఆంధ్ర ర్యాలీలో భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగులో: ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు పట్టణంలోని తారురోడ్డులో స్టేట్‌బ్యాంకు వద్ద నుంచి స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛత మెరుగుపరచాలన్నారు. కూటమి నాయకులు జె.రమణారెడ్డి, రాయల్ కిరణ్, మోరగుడి జయుడు, సర్పంచ్ పుల్లారెడ్డి, జింకల బాషా, ఎంఎం బాషా పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: ఉపాధి పనులు ఇతర వ్యవసాయ పనుల వద్ద ఉండే కూలీలు వడదెబ్బ తగలకుం డా అప్రమత్తంగా ఉండాలని ఎంపీ డీవో రమణారెడ్డి అన్నారు. శనివా రం స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్ర మంలో భాగంగా రంగసము ద్రం పంచాయతీలో జడ్పీటీసీ ముత్యాల ప్రసా ద్, మండల ఉపాధ్యక్షుడు సీఎంబా షా, సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, తహసీ ల్దారు చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొని ర్యాలీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజీవ్‌రెడ్డి, ఎంపీటీసీ కల్యకూరి రమణ, చెన్ను రాజశే ఖర్ పాల్గొన్నారు. పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర , స్వచ్ఛ దివస్ టీం, బిట్ ది హిట్ సందర్భంగా పోరుమామిళ్లలో ర్యాలీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధికూలీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో, వైద్యాధికారి

బి.కోడూరులో:ఉపాధి హామీపథకం కింద పనిచేస్తున్న కూలీలు వేసవిని దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ తగిలే లక్షణాలపై వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయకిరణ్, ఎంపీడీవో భాస్కర్‌రావులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎవరైనా నీరసం, వాంతులు కళ్లు తిరుగుట లక్షణాలు కనబడితే వెంటనే వైద్యాధి కారులకు సమాచారం అందించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజరు, పంచాయతీ సెక్రటరీ, ఏఎన్ఎం పాల్గొన్నారు.

అట్లూరులో: మండలంలోని ఏడు సచివాలయాల పరిధిలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర లో మండల అధికారులు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఎంపీడీవో భాస్కర్‌బాబు, మండల టీడీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, మల్లికార్జున రెడ్డి, రెడ్డయ్య, రాజశేఖర్‌రెడ్డి, మునిరెడ్డి, రామక్రిష్టారెడ్డి పాల్గొన్నారు. కమలకూరు ఎస్.వెంకటాపురం, కొండూరు ఉపాధి పనులు నిర్వహించే ప్రదేశాల్లో మజ్జిగ పంపిణీ చేశారు. ఎస్.వెంకటాపురంలో గ్రీన్‌అంబాసిడర్లను శాలువ కప్పి సత్కరించారు.